## క్లుప్తంగా

### నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం



**కమలాపూర్ :** మండల కేంద్రంలో మంగళవారం తాగు నీటి సరఫరాకు అంతరాయం కలుగనుందని గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ గుండె బాబు, పంచాయతీ కార్యదర్శి కొరండ్ల రమణారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రం పరిధిలోని కన్నూరు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న మంచినీటి బావి మోటార్ కాలిపోయిందని, దీంతో ఆ మోటార్‌కు మరమ్మతులు చేయిస్తున్నందున తాగు నీటి సరఫరా నిలిపి వేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

### జనరేటర్ బహూకరణ



**శాయంపేట :** మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీమత్స్యగిరి స్వామి దేవాలయానికి మండల కేంద్రానికి చెందిన మామిడి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వారి కుమారులు మామిడి ప్రమోద్, త్రిశూల్, సాయిక్రిష్ణలు రూ.35వేల విలువచేసే జనరేటర్‌ను సోమవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి జనరేటర్ అందించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దాసరి వేణు, కల్పన పాల్గొన్నారు.

### 'ఆంజనేయస్వామికి చందనం'



**శాయంపేట :** మండల కేంద్రంలోని మచ్చర్లయ్య గుట్టపై వెలసిన ఆంజనేయస్వామికి హనుమాన్ మాలధారులు సోమవారం చందనం వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీమత్స్యగిరి స్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి మత్స్యగిరి స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఏనుగు వాహనంపై తీసుకుని వచ్చి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ వేడుకను పురస్కరించుకుని హనుమాన్ విగ్రహానికి చందనం వేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు వడ్డెపల్లి శ్రీనివాస్, తట్ల రాజశేఖర్, కోడూరి నాగరాజు, గణేశ్, శశి, అరవింద్, మధు, శ్రీధర్, మహేందర్ పాల్గొన్నారు.

### మజ్జిగ ప్యాకెట్లు, అరటిపండ్లు పంపిణీ

**వేలేరు :** ఉపాధి హామీ పనిచేస్తున్న కూలీలకు మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ సోమవారం మజ్జిగ ప్యాకెట్లు, అరటిపండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని, దీంతో గ్రామాల్లో వలసలు ఆగిపోయాయని అన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, తిరుపతిరెడ్డి, సంపత్, అనిల్, సలీం మాలీక్, శంకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### రేణుకా ఎల్లమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

**ఎల్కతుర్తి :** మండలంలోని కోతులనడుమ గ్రామంలో జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ విగ్రహ పత్రిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా సోమవారం అమ్మవారిని హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ దర్శించుకుని మొక్కులు చెల్లించారు. గ్రామమహిళలు అమ్మవారికి నైవేద్యంతో చేసిన బోనాలతో ఊరేగింపుగా డప్పుచప్పుళ్ల నడుమ అమ్మవారి ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, నాయకులు గొల్లె మహేందర్, తంగెడ మహేందర్, తంగెడ నగేశ్, శేషగిరి, సాంబమూర్తి పాల్గొన్నారు.

**ఐనవోలు :** మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో ఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాల్లో మొదటి రోజు ఉత్సవ అనుజ్ఞ, ఆలయ ప్రదక్షిణ పూర్వక యాగశాల ప్రవేశన, అగ్ని ప్రతిష్ఠాపన, నీరాజన మంత్రపుష్ప సమర్పణ, నిత్య బలిహరణను కోమల్లపల్లి సంపత్ కుమార్, రుత్విక్ బృందం ఆధ్వర్యంలో జరిపించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగేశ్వర్‌రావు, ఉప ప్రధాన అర్చకులు రవీందర్, దేవాలయ నిర్మాణ దాత సర్వేశ్వర్‌రావు యాదవ్ కుటుంబ సభ్యులు, ముఖ్య అర్చకులు శ్రీనివాస్, మధుకర్ శర్మ పాల్గొన్నారు.

# పచ్చదనం..ఆహ్లాదం

- రహదారులను అల్లుకున్న చెట్లు
- సేదదీరుతున్న ప్రయాణికులు
- హర్షిస్తున్న ప్రకృతి ప్రేమికులు



వీరనారాయణపూర్ దారిలో ఆహ్లాదాన్ని పంచుతున్న పచ్చని చెట్లు



రహదారికిరువైపులా ఉన్న చెట్టు కింద సేదదీరుతున్న వాహనదారుడు

**ఎల్కతుర్తి :** పర్యావరణ పరిరక్షణకు అధికారులు చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. మండలంలోని కోతులనడుమ నుంచి వీరనారాయణపూర్, వల్భాపూర్ నుంచి దండేపల్లి వరకు, గోపాల్‌పూర్ నుంచి ఇందిరానగర్ వరకు, కోతులనడుమ క్రాస్ నుంచి జీల్గుల, జగన్నాథ్‌పూర్ వరకు తిమ్మాపూర్ నుంచి కేశవాపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్లకిరువైపులా గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా నాటిన మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. చెట్లుగా ఎదిగి పచ్చని హారంగా విలసిల్లుతున్నాయి. వాతావరణ ఎద్దడిని తట్టుకున్న మొక్కలు కావడంతో ప్రస్తుతం ఏపుగా పెరిగాయి. ఇటీవలే మండలంలో కురిసిన వర్షానికి చెట్లన్ని పచ్చదనంతో ప్రధాన రహదారులకిరువైపులా ఆకుపచ్చ తోరణాన్ని తలపిస్తున్నాయి. అటుగా వెళ్లే బాటసారులకు, ప్రయాణికులకు నీడనందించడమే కాకుండా చల్లటి ఆహ్లాద వాతావరణాన్ని అందిస్తున్నాయి. వల్భాపూర్, తిమ్మాపూర్, కేశవాపూర్ గ్రామాల రైతులు రోడ్ల పక్కన గల పొలం గట్లపై నాటిన టేకు మొక్కలు సైతం ఏపుగా పెరిగి చల్లటి నీడనందిస్తుండడంతో బాటసారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగన్నాథ్‌పూర్, కేశవాపూర్, జీల్గుల నుంచి హనుమంతపురికి వెళ్లే రహదారుల వెంబడి నాటిన గానుగ చెట్లు ఏపుగా పెరిగి నీడనందించడమే కాకుడా వాటికి కాసిన గింజలు ఎండి బయోడీజిల్ తయారీకి ఉపయోగపడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండకు ఎండిపోకుండా ఉండేందుకు అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అవి ఎండిపోకుండా చూసి భవిష్యత్ తరాలకు చెట్ల వినియోగం గురించి కలిగే ఉపయోగాలు, మనుగడ గురించి అవగాహన కల్పించాలని బాటసారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

- ఏఓ రాజ్‌కుమార్

**కమలాపూర్ :** విత్తన ఎంపికలో రైతులు తగు జాగ్రత్తలు పాటిండంతో పాటు కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలని ఏఓ రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని వంగపల్లి రైతు వేదికలో సోమవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా నకిలీ, కల్తీ విత్తనాలు విక్రయిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. పంట కోతల అనంతరం వ్యర్థాలను కాల్చకుండా భూమిలోనే కలియ దున్నడం ద్వారా సేంద్రియ కర్బనం పెరిగి పంట దిగుబడి, నేల ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త భార్గవి మాట్లాడుతూ.. పంట సాగులో సేంద్రియ ఎరువుల వినియోగం పెంచి రసాయన ఎరువులు (యూరియా) వినియోగం తగ్గించాలని, పంట మార్పిడి, భూ, జల కాలుష్య నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యవసాయ శాస్త్రవేత్త అర్చన మాట్లాడుతూ.. రైతులు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై అవగాహన కలిగి ఉండాలని, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనే సమయంలో తప్పనిసరిగా రశీదులు తీసుకుని భద్రపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఏఈఓలు జయప్రకాశ్, ప్రశాంత్, రహీం, నాయకులు నారాయణరెడ్డి, భిక్షపతి, సాంబరావు, రమేశ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



కమలాపూర్ : రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త భార్గవి

**ఐనవోలు :** సాగు ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు పొందాలని శాస్త్రవేత్తలు సంతోశ్, యశస్విని అన్నారు. సోమవారం మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. భూసార పరీక్ష ప్రాముఖ్యత, పంట మార్పిడి చేసుకోవాలని, పురుగుల ఉధృతి తగ్గించుకోవడం గురించి అవగాహన కల్పించారు. ఎంఏఓ సునీల్‌కుమార్, ఏఈఓ ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

### దగ్ధమైన పంటల పరిశీలన



**శాయంపేట :** మండలంలోని పత్తిపాక గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు పంట వ్యర్థాలను కాల్చే క్రమంలో గ్రామానికి చెందిన అన్నబోయిన రఘుపతికి చెందిన మూడు ఎకరాల ముప్పై ఆరు గుంటల్లో సాగుచేసిన మొక్కజొన్న కంకి పూర్తిగా దగ్ధం కాగా ధాన్యం కుప్ప 60శాతం కాలిపోయినట్లు రైతులు తెలిపారు. దీంతో బాధితుడు రఘుపతి మండల వ్యవసాయ అధికారి గంగాజమునకు దరఖాస్తు చేయగా సోమవారం ఏఓ గంగాజమున దగ్ధమైన మొక్కజొన్న కంకులను, ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రైతులు పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా వాయు కాలుష్యం, భూమి సారం క్షీణించడం, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక నష్టం, భూమిలో సేంద్రియ కర్బన శాతం తగ్గుతుందని తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చడం వలన భూమి నిస్సారంగా మారుతుందని, పర్యావరణం దెబ్బతింటుందని, విషవాయువులు విడుదల అవుతాయని అన్నారు. పంట వ్యర్థాలను భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. రైతులు వ్యవసాయశాఖ సూచనలు పాటించాలని సూచించారు.

## గజవాహనంపై కొలువుదీరిన మత్స్యగిరీషుడు



శాయంపేట : గజవాహనంపై మచ్చర్లయ్యగుట్టకు బయలుదేరిన మత్స్యగిరి స్వామి



ఐనవోలు : చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు



ఆత్మకూరులో..

**శాయంపేట :** మండల కేంద్రంలోని శ్రీమత్స్యగిరి స్వామి ఆలయంలోని శ్రీమత్స్యగిరి స్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం గజవాహనంపై మత్స్యగిరీషుడు కొలువుదీరి పురవీధుల గుండా మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా మండల కేంద్రంలోని మచ్చర్లయ్య గుట్టకు బయలుదేరాడు. గ్రామంలోని మహిళలు మంగళహారతులతో మత్స్యగిరిషునికి స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు అరుట్ల కృష్ణమాచార్యులు గుట్ట ఆలయ గృహలో మత్స్యగిరి స్వామికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. దేవాలయం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్‌సేనారెడ్డి, జిన్నా కృపాకర్‌రెడ్డి, గట్ల భగవాన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, వరంగల్ మాజీ కార్పొరేటర్ బాసని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కందగట్ల రవి, మాజీ ఉపసర్పంచ్ సుమన్, రవి, రవీందర్ (బుజ్జన్న), శివశంకర్, గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం**

**దామెర :** మండలంలోని ల్యాదెళ్లలో వేంకటేశ్వర స్వామి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. అర్చకులు శరత్ శర్మ, కేశవాచార్యులు వేద మంత్రోచ్చరణ నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెసరు విజయ్‌చందర్‌రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం నిర్వహించిన కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహిపాల్‌రెడ్డి, రమేశ్, రవి, నాగేంద్రబాబు, రోహిత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**లక్ష్మీనరసింహుడికి ఘనంగా పుష్పయాగం**

**ఐనవోలు :** కక్కిరాలపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. సోమవారం ఉదయం మహా పూర్ణాహుతి, బలిహరణం, అనంతరం చక్రస్నానం, అవభృదోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం ద్వాదశారాధనలు, శ్రీపుష్పయాగం, దేవతా ఉద్వాసన, ద్వాదశ ఆరాధన సేవలు విశేషంగా జరిపించారు. ధ్వజపట ఉద్వాసన, ఋుత్విక్ సన్మానం చేసిన అనంతరం స్వామి అమ్మవార్లకు పవళింపు సేవ, పుష్పోత్సవం, ఏకాంత సేవ జరిపించారు. భక్తులకు తీర్థం, 12 రకాల ప్రసాదాలు అందజేయడంతో బ్రహ్మోత్సవాలు పూర్తయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పంచామృతాలు, పూలు సమర్పించి కార్యక్రమాలు తిలకించారు. ఆలయ చైర్మన్ సత్యనారాయణ, కమిటీ సభ్యులు మోహన్ పాల్గొన్నారు.

**వేణుగోపాలస్వామి జాతర**

**ఆత్మకూరు :** మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం స్వామివారి జాతర వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. అర్చకులు మాధవమూర్తి ప్రత్యేక పూజలు చేశారు.

## సంక్షిప్తంగా

### ఈగల్ వారియర్స్ విజయం

**పరకాల :** వారంరోజులుగా పట్టణంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్-2025లో ఈగల్ వారియర్స్ టీం విజయం సాధించింది. చింతల్ గ్రౌండ్‌లో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి హాజరై విజేత ఈగల్ వారియర్స్ టీంకు ట్రోఫీ అందజేయడంతో పాటు రన్నర్ అఫ్‌గా నిలిచిన పైడిపల్లి టీంకు బహుమతి ప్రదానం చేశారు. క్రీడాలు పోటీతత్వంతో పాటు ఐక్యతకు దోహదపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, టోర్నమెంట్ నిర్వాహకుడు ఎల్తూరి సమ్మెత్ వర్ధన్, వినాయక ఆసుపత్రి యాజమాని సతీశ్, ఎస్ఎస్ఆర్ పవన్‌కుమార్, మంద టునిట్, చక్రపాణి, సునీల్, అకీల్, సిద్దు, బాబు పాల్గొన్నారు.

### వ్యవసాయ మోటార్ల చోరీ

**కమలాపూర్ :** మండలంలోని లక్ష్మీపూర్‌లో గుర్తుతెలియని దుండగులు వ్యవసాయ మోటార్లతో పాటు గ్రామపంచాయతీ బోరు మోటార్ ఎత్తుకెళ్లారు. రైతులు, పంచాయతీ కార్యదర్శి రమణ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపూర్‌కు చెందిన పలువురు రైతులు పంటసాగు కోసం శనిగరం వాగు వెంట 5 హెచ్‌పీ మోటార్లు అమర్చుకోగా ఈనెల 10న రాత్రి గుర్తు తెలియని దుండగులు మోటార్లతో పాటు గ్రామపంచాయతీ బోరు మోటార్‌ను ధ్వసం చేసి వాటిల్లోని కాపర్ వైరు ఎత్తుకెళ్లారు. గత ఫిబ్రవరి 25న సైతం రైతుల వ్యవసాయ మోటార్లతో పాటు గ్రామపంచాయతీకి చెందిన బోర్ మోటార్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారని రైతులు, పంచాయతీ కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది నవంబర్‌లో సైతం వ్యవసాయ మోటార్ల చోరీకి యత్నించారని, వరుస చోరీలతో భయాందోళన తప్పడం లేదని అన్నారు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధిత రైతులు, పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

### ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం

- ఒకరిపై కేసు నమోదు

**ఐనవోలు :** ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పంథిని గ్రామ శివారులో కుడా, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు ఈనెల 9న వెళ్లారు. అక్కడ ఫంక్షన్‌హాల్ నిర్మాణం చేస్తున్న మేరుగు రమేశ్ అధికారులతో ఘర్షణ పడటమే కాకుండా మండల సర్వేయర్ సూరజ్‌ను వ్యక్తిగతంగా దూషించి బెదిరించాడు. ఈ ఘటనపై సూరజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బీఎస్ఎస్ చట్టం 292, 132, 351 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి

**వేలేరు :** స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సురేందర్ (60) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గత రెండేళ్లుగా హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సురేందర్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో సెలవుల్లో ఉన్నారు. సోమవారం ఉదయం వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై సురేశ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

## ప్రజలను పెద్దమ్మతల్లి చల్లగా చూడాలి

- ఎమ్మెల్సీ మధుసూదనాచారి



**శాయంపేట :** గ్రామ ప్రజలను పెద్దమ్మ తల్లి చల్లగా చూడాలని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. మండలంలోని కొప్పులలో ఇటీవల పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన జరుగగా సోమవారం ముదిరాజ్ కులస్తులంతా బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొప్పుల గ్రామ ప్రజలను పెద్దమ్మతల్లి చల్లగా చూడాలని కోరారు. గ్రామంలో రైతుల పంటలు బాగా పండేలా పెద్దమ్మతల్లి ఆశీస్సులు ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు.

# జగ్గారెడ్డి.. మాటలు జాగ్రత్త

- మండిపడిన బీజేపీ శ్రేణులు
- దిష్టిబొమ్మ దహనం



జగ్గారెడ్డి చిత్రపటాన్ని దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

**కమలాపూర్ :** మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ శ్రేణులు మండిపడ్డారు. మండల కేంద్రంలో సోమవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో జగ్గారెడ్డి చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎంపీ ఈటల రాజేందర్ పదవుల కోసం పాకులాడే వ్యక్తి కాదన్నారు. ఈటలకు బీజేపీ సముచిత స్థానం కల్పించిందని అన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు ఇవ్వడమే కాకుండా రెండు చోట్ల పోటీ చేసే అవకాశం, ఆ తర్వాత ఎంపీగా అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఈటలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే జగ్గారెడ్డికి పదవి వస్తుందని భావించి అగ్రకుల దురహంకారంతో వ్యవహరించాడని, కానీ బీసీ కులాల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఇప్పటికైనా ఈటలపై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకుని ఈటలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ జెడ్పీటీసీ సాంబరావు, రమేశ్‌బాబు, శ్రీనివాస్, రత్నాకర్, తుమ్మ శోభన్, జేరుపోతుల రమేశ్, పబ్బు సాంబయ్య, శనిగరపు సంపత్, రత్నం, ఆనందం పాల్గొన్నారు.

## సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

**శాయంపేట :** ఈనెల 26, 27వ తేదీల్లో హసన్‌పర్తి మండల కేంద్రంలో జరిగే సీపీఐ జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి పిలుపునిచ్చారు. మాందారిపేట శివారులో గల గుడిసెవాసుల సమావేశం సీపీఐ నాయకుడు బండారి సాంబయ్య అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా భిక్షపతి పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంపై మోదీ ప్రభుత్వం దొంగ ప్రేమ చూపిస్తోందని, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులకు రెండు లక్షల రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ పారదర్శకంగా, అర్హులైన పేదలకు అందించాలని, అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సమగ్ర అభివృద్ధికై సీపీఐ రాజీలేని పోరాటాలు చేస్తోందని, ఈనెల 26, 27వ తేదీల్లో హసన్‌పర్తి మండల కేంద్రంలో నిర్వహించనున్న జిల్లా 2వ మహాసభలకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం మాందారిపేట, గట్లకానిపర్తి, సూరంపేట గ్రామాల సీపీఐ అధ్యక్షులుగా బండారి సాంబయ్య, సముద్రాల మణెమ్మ, బొంకురి కోమలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బత్తిని సదానందం, మండల సహాయ కార్యదర్శి అనుకారి అశోక్, నాయకులు వల్లాల రమేశ్, ఎండీ.అంకూషావలీ, సముద్రాల మణెమ్మ, బొంకురి కోమల, సుగుణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న లింగయ్య

**ధర్మసాగర్ :** ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన ఆ సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం యాదవ, కురుమలను మోసం చేసినట్టే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో యాదవ, కురుమలకు రెండు లక్షల నగదు బదిలీ ద్వారా అందచేస్తామని, రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. కానీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న హామీలను నెరవేర్చకుండా గత ప్రభుత్వం అడుగుజాడల్లో నడుస్తుందని విమర్శించారు. గొర్రెలకు పశు వైద్యశాలల్లో ఏలాంటి మందులు అందుబాటులో ఉండటం లేదని, కనీసం నట్టల మందులు కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా వీది కుక్కల దాడులు, రకరకాల ప్రమాదాల్లో వందలాది గొర్రెలు మృత్యువాత పడుతున్నాయని, గొర్రెల కాపరులు ప్రమాదవశాత్తు మరణిస్తున్నా ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఇప్పటి వరకు పశుసంవర్ధక శాఖకు మంత్రిని కూడా కేటాయించలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, లేనిపక్షంలో గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గంటే సమ్మయ్య, మండల అధ్యక్షుడు తొట్టె భీమన్న, నాయకులు మామిడి కుమార్, కాసాని పరుశరాములు, దాసరి నాగరాజు, మేకల రాజన్న, తూముల కుమారస్వామి, బెల్లం ప్రేమ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

- హార్టికల్చర్ అధికారి సుస్మిత



మాట్లాడుతున్న సుస్మిత

**ధర్మసాగర్ :** ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని హార్టికల్చర్ అధికారి సుస్మిత అన్నారు. మండలంలోని దేవునూర్ గ్రామంలో ఉద్యాన శాఖ, కేఎస్ బయోసైన్సెస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతు కామెర రాజయ్య ఆయిల్ పామ్ క్షేత్రంలో సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ తోటలు సాగు చేసే రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, భవిష్యత్‌లో ఆయిల్ పామ్ 100 శాతం భరోసాగా నిలుస్తోందని తెలిపారు. ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు, డ్రిప్పు ద్వారా ఎరువులు పంపే విధానాన్ని రైతులకు వేసవిలో ఆయిల్ పామ్ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆయిల్ ఫామ్ సాగు చట్టబద్ధతతో కూడుకున్నదని, రైతులు సందేహపడాల్సిన అవసరం లేదన్నారు. మంచి యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడికి కృషి చేయాలని అన్నారు. 2025-26 సంవత్సరంలో కొత్తగా విస్తీర్ణం పెంచేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. అనంతరం కేఎస్ బయోసైన్సెస్ జిల్లా మేనేజర్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. సాగు చేసే రైతులకు ఆయిల్ ఫామ్ టన్నుకు రూ.21,000 ఉందని, ప్రస్తుతానికి రెండు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. భీమదేవరపల్లి మండలంలోని కొత్తపల్లి, ఎల్కతుర్తి మండలంలోని బావుపేట గ్రామాల్లో ఆయిల్ పామ్ గెలల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. త్వరలోనే ములుగులో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఫీల్డ్ ఆఫీసర్ విక్రమ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు వినతి



**ఆత్మకూరు :** మండలంలోని కటాక్షపూర్ శివారు రామ లింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో జాతీయ రహదారిపై గల డివైడర్ మూయొద్దని సోమవారం కటాక్షపూర్ గ్రామస్తులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని హనుమకొండలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే అధికారులతో మాట్లాడి డివైడర్ మూయొద్దని సూచించారు. గ్రామస్తులు కుడుతాల రమేశ్, సతీశ్, గఫూర్, రాజన్న, సుధాకర్, రవి, శ్రీనివాస్, మురళీ, రాజు పాల్గొన్నారు.